క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

దంతాలపల్లి: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పిల్లల రాజు ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారే సమాచారం వచ్చిందన్నారు. గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఆ ట్రాక్టర్ సీజ్ చేసి డ్రైవర్ గంగర బోయిన సైదులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆహ్వానపత్రిక అందజేత

కేసముద్రం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ధన్నసరిలో ఈనెల 26న నిర్వహించనున్న శ్రీమల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆదివారం మండలంలోని కల్వల గ్రామంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, ధన్నసరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న అందజేశారు. అదే విధంగా కేసముద్రంలో ఎస్సై మురళీధర్‌రాజుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నర్రా అశోక్, కొసని శ్రీధర్, తండా మహేష్, నానబాల ఐలయ్య పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి

గార్ల: మండలంలో సీపీఐ బలోపేతానికి ఎనలేని కృషి చేసి అమరుడైన ముంగి రమేష్ చిరస్మరణీయుడని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలం లోని మద్దివంచ గ్రామంలో రమేష్ 9వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్, ఎం.వెంకన్న, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, భిక్షం, సర్వర్‌మియా, దాదామియా, శ్రీనివాస్, గౌస్‌పాషా, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

తొర్రూరు: సేవా కార్యక్రమాలకు చేయూత అవసరమని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. కాకిరాల జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్ సొసైటీకి అందించారు.

ఆర్థికసాయం



డోర్నకల్: ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డోర్నకల్‌కు చెందిన రెడ్డెబోయిన శ్రీనివాస్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు రూ.50వేల ఆర్థికసాయం అందించారు. కొద్ది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన శ్రీనివాస్‌ను ఆదుకోవాలని ప్రభుత్వ రాంచంద్రునాయక్ ఆదేశించడంతో శ్రీనివాస్‌ను పరామర్శించారు. నాయకులు హనుమంతరావు, అనిల్, సత్తిరెడ్డి ఉన్నారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామానికి చెందిన పోతుగంటి జగన్నాధాచారి అదృశ్యమైన కేసులో కేసముద్రంలో ఆయన కనిపించగా తీసుకువచ్చి కుమారుడు విజయ్‌కు అప్పగించామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆదివారం తెలిపారు. ఈనెల 18వ తేదీన జగన్నాధాచారి ఇంటి నుంచి బయటకు వచ్చి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం వెతికి ఈనెల 21వ తేదీన కుమారుడు విజయ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు శివరామకృష్ణ, మైనోబీ, పీసీ రవీందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి



రేణుక (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ విద్యార్థిని మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని తండ్రి మేకల దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం.. తమ కుమార్తె రేణుక (15) కడుపు నొప్పితో బాధపడుతుండగా శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చామని తెలిపారు. మూత్రం రావడంలేదని వైద్య సిబ్బందికి తెలియజేశామన్నారు. చెప్పినప్పటికీ వైద్యులు పట్టించుకోలేదన్నారు. అంతేకాకుండా ఆదివారం మధ్యాహ్నం సమయంలో తమ వద్ద రూ.300 తీసుకొని మూత్రం పైపు వేశారని పేర్కొన్నారు. అనంతరం పది నిమిషాలలోపే మృతి చెందిందని, తమ కుమార్తె మృతికి కారణమైన వారిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని కోరారు. కాగా ఈ విషయంపై జీజీహెచ్ ఆర్‌ఎంఓ డాక్టర్ జగదీశ్వర్‌ను వివరణ కోరగా రేణుకకు వైద్య చికిత్స అందించిన విషయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంలేదని పేర్కొన్నారు.

బాబోయ్ కుక్కలు..!

- బయటికి వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు
- రాత్రి వేళల్లో గొర్రెలు, మేకలపై దాడులు



పుట్టకోట బజారులో గుంపులుగా శునకాలు

గార్ల: గార్ల మండలంలో కుక్కల బెడద నివారణకు సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా పాఠశాలకు పంపాలంటే భయమేస్తుందని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు బైక్‌లపై వెళ్తుంటే కుక్కలు బైక్‌ల వెంటపడుతుండటంతో వాహనదారులు భయపడుతూ స్పీడ్‌గా వెళ్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గత కొన్నేళ్ల క్రితం గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో కుక్కల సంఖ్య ఎక్కువగా ఉంటే, వాటిని సంహరించేవారు. జంతు సంరక్షణ సమితి చట్టం వచ్చినప్పటి నుంచి కుక్కలను సంహరించాలంటే పంచాయతీ సిబ్బంది సైతం భయపడుతున్నారు. ప్రతీ రోజు ఎవరో ఒకరు కుక్క కాటు గురై, స్థానిక సీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని గిరిజన తండాల్లో, గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ రాత్రి సమయంలో గొర్రెలు, మేకలను చంపేస్తుండటంతో కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాత్రి సమయాల్లో ఇళ్ల నుంచి బయటికి బయడుతున్నామని తండా వాస్తులు పేర్కొంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారి స్పందించి మండలంలో కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు చేపట్టాలి



గ్రామాల్లో రాత్రి సమయాల్లో గొర్రెలు, మేకల దొడ్లల్లోకి కుక్కలు చొరబడి మూగజీవాలను చంపేస్తున్నాయి. రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. జిల్లా పంచాయతీ అధికారి స్పందించి గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి.

– కుమారస్వామి, గార్ల

కవిత పర్యటనను విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాలోత్ కవిత

మహబూబాబాద్: మానుకోట జిల్లాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత పర్యటన సందర్భంగ ఏర్పాట్లను ఆదివారం మాలోత్ కవిత, బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. నేడు ఉదయం డోర్నకల్ నియోజకవర్గంలో ఉదయం 12గంటలకు జిల్లా కేంద్రంలో మిర్చియార్డు సందర్శిస్తారన్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రెస్‌మీట్ ఉంటుందన్నారు. ఆ తర్వాత భూపాలపల్లి బయలు దేరి వెళ్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మార్నేని వెంకన్న, మర్రి రంగారావు, యాళ్ల మురళీదర్, మహబూబ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

కురవి: బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు(సోమవారం) కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పక్కకు వంగి.. ప్రమాదకరంగా మారి



వంగిన విద్యుత్ స్తంభం

గార్ల: గార్లలోని పాత సమత హైస్కూల్ ఎదురుగా వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలిపోయి ఇళ్ల మీద పడుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే డబుల్ రోడ్డు బీటీ రహదారి పక్కనే ఈ ఇనుప విద్యుత్ స్తంభాన్ని గత ఏడాది క్రితం రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒంగిపోయి ప్రమాదపు అంచుల్లో ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి దాని స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాలలో సరైన సౌకర్యాలను కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు సహాయపడడానికి ఆశవర్కర్లు ఉన్నప్పటికీ, పురుష దివ్యాంగులు వచ్చినప్పుడు, వారిని వీల్‌చైర్ నుంచి లేపడానికి మహిళా ఆశవర్కర్లకు ఇబ్బందిగా ఉంటుందని, పురుష దివ్యాంగులకు సహాయం అందించే విధంగా పురుష సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు ధరావత్ బద్రి నాయక్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల్లో సరైన సౌకర్యాలను కల్పించాలని మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల దివ్యాంగ ఉపాధ్యాయుడు తేజావత్ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

కేసీఆర్ అభిమానికి చేయూత

మహబూబాబాద్: జిల్లాలోని దంతాలపల్లి మండలం రామానుజాపురం గ్రామానికి చెందిన చిర్రా సతీష్ కుటుంబం 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకర్తగా కేసీఆర్ వీరాభిమానిగా ఉన్నారు. డిగ్రీ పూర్తి చేసిన సతీష్ స్వయం ఉపాధి కోసం జిరాక్స్ మిషన్ ఇప్పిస్తే స్వయం ఉపాధి పొందుతానని ఇటీవల కేసీఆర్ జన్మదినం రోజున ఎమ్మెల్సీ కవితకు మేసేజ్ పెట్టారు. ఎమ్మెల్సీ కవిత వెంటనే స్పందించారు. అభిమాని కోరిక మేరకు ఎమ్మెల్సీ కవిత ఈనెల 24న గ్రామానికి వచ్చి జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు.

గెలుపు కోసం ప్రచారం

మహబూబాబాద్ రూరల్: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వాదాన్ని బలపరిచి సుందర్‌రాజు యాదవ్ గెలుపు కోసం ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగారపు రామకృష్ణ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, జిల్లా అధ్యక్షులు దుండి అశోక్, ప్రధాన కార్యదర్శి జెట్టి యాకయ్య పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన పిట్టల వీరన్న ఆదివారం ఉదయం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డిని వివరణ కోరగా వీరన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందని, తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

విద్యుత్ కిట్ల అందజేత

మహబూబాబాద్ రూరల్: విద్యుత్ కార్మికులకు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ కార్మికులకు టపారియా కిట్, పోల్ ఎక్కడానికి సేఫ్టీ బెల్ట్ భద్రత, ఇతర భద్రత సామాగ్రి కిట్లను ఆదివారం అందజేశారు. మహబూబాబాద్ సబ్ డివిజన్ పరిధిలో గల కార్మికులకు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ పెరుమాళ్లపల్లి విజయకుమార్ సారథ్యంలో ఏడీఈ ప్రశాంత్ విద్యుత్ కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్మికులు ఎస్ఎల్ఐ రవీందర్ రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు స్వామి, పడాల శ్రీనివాస్, లైన్ మెన్లు కంబాల శ్రీనివాస్, వివేక్ , తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా గుడుంబా తయారీ

డోర్నకల్: ఇంటి వద్ద నాటుసారా తయారు చేస్తే పోలీసులు గుర్తించి దాడులు చేస్తారని కొంతమంది అడవులు, పంటపొలాల్లో గుడంబా తయారీ బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. వెన్నారం, బూరుగుపాడు మార్గంలో ఎస్సారెస్పీ కాల్వ సమీపంలోని గుట్టతో పాటు వ్యవసాయ బావులు, రాళ్ల గుట్టల్లో గుర్తు తెలియని వ్యక్తులు బట్టీని ఏర్పాటు చేసి గుడంబాను తయారు చేస్తున్నారు. గుడుంబా అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు ప్రపంచ ప్రింటర్స్ డే

మహబూబాబాద్: ప్రింటింగ్ పితామహుడు సర్ జోహన్నస్ గూటెన్‌బర్గ్ జయంతి సందర్భంగా సోమవారం ప్రపంచ ప్రింటర్స్ డే వేడుకలు మానుకోట ప్రింటర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి నక్కా నాగార్జున ఆదివారం తెలిపారు. ప్రింటింగ్ రంగంలో మార్పులు వచ్చినా తమ జీవితంలో మాత్రం మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతికాభివృద్ధి చెంది ప్రజల అవసరాలకు అనుగుణంగా అతితక్కువ సమయంలో ఎక్కువగా ముద్రణ జరుగుతుందన్నారు. తమ ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని ప్రింటింగ్ ప్రెస్ యజమానులను, కార్మికులను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరుతోపాటు సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 41 ప్రింటింగ్ ప్రెస్‌లు ఉన్నాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోనే 20 ప్రింటింగ్ ప్రెస్‌లు ఉండగా మరిపెడలో5, డోర్నకల్‌లో 3, తొర్రూరులో 5, బయ్యారంలో 3, పెద్దవంగరలో 2, గంగారంలో 1, కొత్తగూడలో 1 కేసముద్రంలో 2 ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రమాదమని తెలిసినా..



టాటా ఏస్ వాహనంలో వెళ్తున్న కూలీలు

మహబూబాబాద్ రూరల్: ప్రస్తుతం మిర్చి ఏరటం పలువురు మహిళలు, పురుషులకు ఉపాధిగా మారడంతో మిరప కూలీలు ఆరాటపడుతూ ప్రమాదం జరుగుతుందని తెలిసినా సరే ప్రతిరోజు వివిధ వాహనాల్లో గ్రామాలకు వచ్చి వెళ్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి సెంటర్లో టాటా ఏస్ వాహనంలో మిర్చి కూలీలు కుప్పగా కూర్చొని వెళ్తున్న దృశ్యం కనిపించింది.

మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి



పెద్దవంగర: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవంగర: ఈనెల 28న ఢిల్లీలో నిర్వహించే ఆల్ ఇండియా సదస్సును విజయవంత చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆల్ ఇండియా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వీరన్న మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు గుగులోత్ పూల్‌సింగ్, నాయకులు అజయ్, ఎల్లన్న, యాకయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం

గంగారం: ఫిబ్రవరి 28న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని గంగారం, కొత్తగూడ మండలాల సంయుక్త కార్యదర్శి పూనెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండలంలోని కొడిసెల మిట్టలో ఫిబ్రవరి 28న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెరిగిపోతున్న మత ఉన్మాదం, పతనం అవుతున్న లౌకిక విలువలు, ఫెడరల్ స్ఫూర్తికి కలుగుతున్న అపార నష్టాలపై చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. ఫిబ్రవరి 10నుంచి 25వరకు గ్రామగ్రామాన సభలు, సమావేశాలు, ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలను సంఘటిత పర్చనున్నామన్నారు.కార్యక్రమంలో నాయకులు ఈక బిక్షమ్ రవి, కృష్ణ, రమేష్, నారాయణ, పోతయ్య,బాబు, శ్రీకాంత్, స్టాలిన్, నాగరాజు, భరత్, జయపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న చలో ఢిల్లీ సదస్సును జయప్రదం చేయాలంటూ పార్టీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పైండ్ల యాకయ్య, కందాల రంగయ్య, జానకీరాములు, జంపాల రాము, సుధాకర్, బద్రు పాల్గొన్నారు.

శివరాత్రికి గుండం ఆలయం ముస్తాబు



గుండం శివాలయం

కొత్తగూడ: మహాశివరాత్రి పర్వదినం కోసం మండలంలోని గుండం శివాలయం సిద్ధమవుతోంది. పాకాల సరస్సును గుండంపల్లి గ్రామ శివారు ఆనుకుని పచ్చటి అభయారణ్యంలో కాకతీయ మహారాజు ప్రతాపరుద్రుడు నిర్మించిన ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రామప్ప తరువాత అంతే ప్రశస్త్యం కలిగిన ఆలయం ఇది. ప్రభుత్వం నుంచి ఏమాత్రం ఆదరణ లేకపోయినా స్థానికులు దాతల సహకారంతో ఆలయాన్ని కొద్దికొద్దిగా అభివృద్ధి చేసుకుంటు వస్తున్నారు. కొత్తగూడ, నర్సంపేట, ఖానాపూర్ మండలాల నుంచి భక్తులు మహాశివరాత్రి రోజు అధిక సంఖ్యలో గుండం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

ఆలయ విశిష్టతలు..

అన్ని ఆలయాలకు భిన్నంగా గుండం శివాలయం ఉంటుంది. పడమర దిశకు ప్రధాన ద్వారంతో ఆలయాన్ని నిర్మించారు. గర్భాలయంలో శివలింగం, ఉత్తరాణ వేంకటేశ్వరస్వామి, దక్షిణ దిశలో వీరభద్రుడిని నెలకొల్పి మధ్యలో కల్యాణ మండపం ఏర్పాటు చేశారు. కాకతీయ సామ్రాజ్యానంతరం పాడుబడిపోతున్న ఆలయంలో రామక్క అనే ఆదివాసి భక్తురాలు మహా శివుడికి పూజలు చేసేదని చరిత్ర. ఈ క్రమంలోనే గుండం రామక్క దేవాలయంగా ప్రసిద్ధి గాంచింది. శివరాత్రి సమయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాగాహారం రోజున రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆలయంలోని వేంకటేశ్వరస్వామికి భక్తుడు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. దీంతోపాటు బద్ది పోచమ్మ ఆలయానికి నిధులు మరో భక్తుడు సమకూర్చినట్లు తెలిపారు. శివరాత్రికి జరిగే జాతరకు హాజరుకావాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఆలయ కమిటీ ఆహ్వానం అందజేశారు.

తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న బిషప్ విక్రంపాల్

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని టీబీసీ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్చ్ బిషప్ ఆర్.విక్రంపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ నగర్ కాలనీలో గల టీబీసీ కార్యాలయంలో సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బిషప్ విక్రంపాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్లో త్వరలో తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ సమావేశం జరగనుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీబీసీ కమిటీలు ఏర్పాటు చేసి వారి సలహా సూచనల మేరకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా ఉండేవిధంగా టీబీసీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బిషప్ మల్సూర్ నాయక్, సంయుక్త కార్యదర్శి బిషప్ జి.ఏసుపాదం, కోశాధికారి బిషప్ డేవిడ్ రాజు, జిల్లా అధ్యక్షుడు బిషప్ ఇశ్రాయేలు, జిల్లా సంయుక్త కార్యదర్శి బిషప్ లాల్ సింగ్ పాల్గొన్నారు.

బాలకుమారస్వామి జాతర

గంగారం: మండలంలోని మడగూడెం, కిష్టాపురం గ్రామాలలో నిర్వహించే చుంచ వారి ఇలవేల్పుల బాలకుమారస్వామి జాతర ఆదివారం రెండో రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం బాలకుమారస్వామిని గద్దెలపై నిలిపి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గంగ స్నానం ఆచరించారు. రాత్రి 2గంటలకు గుడి మెలుగుట కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీమకుమారుడు చుంచ రాజశేఖర్, పెద్దవడ్డెలు పెండకట్ల వంశీయులు, పడిగ వడ్డెలు యాప వంశీయులు, తలపతులు చుంచ వంశీయులు, రావుల వంశీయులు జాతరను కొనసాగించడం ఆనవాయితీ.

రైతుల సమస్యలపై స్పందించిన మాజీ మంత్రి

పాలకుర్తి: మండలంలోని శాతపురం గ్రామం ద్వారా వెళ్లే 4 ఎల్ కాల్వలో సాగునీరు రాకపోవడంతో తమకు వచ్చే ఇబ్బందులను రైతుల ద్వారా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలుసుకుని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆదివారం అటు వైపు వెళ్తున్న మాజీ మంత్రికి రైతులు తమ సమస్యను వివరించారు. పై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రెండు మూడు రోజుల్లో నీరు వస్తుందని తెలిపారు. ఆయన వెంట పసునూరి నవీన్, కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య ఉన్నారు.

ఊరు పిలుస్తోంది..



రైల్వేస్టేషన్‌లో బారులుదీరిన కూలీలు

మహారాష్ట్ర కూలీలు ఇంటిబాటు పట్టారు. సుమారు రెండు నెలల పాటు మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోని మిరప తోటల్లో కాయకోత పనులకు వచ్చిన వేలాది మంది కూలీలు తిరుగు పయాణమయ్యారు. ఈనెల 26న శివరాత్రి పండుగ ఉండటతో సొంత ఊళ్లకు బయలుదేరారు. ప్రతీ రోజూ వివిధ ప్రాంతాల నుంచి డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఇక్కడి నుంచి సింగరేణి రైలు ద్వారా మహారాష్ట్రకు వెళ్తున్నారు.

– డోర్నకల్

అరిటాకులు.. మట్టి గ్లాసులు

- ప్లాస్టిక్ రహిత వివాహ విందు
- ఆదర్శంగా నిలిచిన పంచాయతీ కార్యదర్శి



అరిటాకుల్లో భోజనం చేస్తున్న గ్రామస్తులు, బంధువులు

డోర్నకల్: డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్ తన వివాహ వేడుకను ప్లాస్టిక్ రహితంగా జరుపుకుని ఆదర్శంగా నిలిచాడు. గతంలో చాప్లాతండా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సమయంలో తండాను ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్ది అధికారులు, ప్రజల మన్ననలు పొందాడు. అదే స్ఫూర్తితో ఆదివారం ఖమ్మంలోని రెడ్డిగూడెం మారెమ్మగుడి సమీపంలో జరిగిన తన వివాహ వేడుకల్లో అరిటాకులు, మట్టి గ్లాసులు, ప్లాస్టిక్ రహిత టేబుళ్లు, కుర్చీలు, క్లాత్ బ్యానర్లను వినియోగించారు. దీంతో వేడుకకు హాజరైన అధికారులు, బంధువులు సంపత్‌ను అభినందించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన బోళ్ల నాగరాజు అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోమటిపల్లి గ్రామానికి చెందిన బోళ్ల అబ్బయ్య కుమారుడైన నాగరాజు తన భార్యతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో నాగరాజు ఇటీవల ఇంటికి వచ్చాడు. ఈనెల 16న నాగరాజు ఇంట్లో ఉండగా, అతడి తండ్రి అబ్బయ్య మేకలను మేపేందుకు ఊరిబయటకు వెళ్లాడు. అబ్బయ్య తిరిగి ఇంటికి వచ్చి చూడగా నాగరాజు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. తండ్రి అబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.